

శారద లేఖలు

సౌభాగ్యవతి కల్పలతకు,

నెచ్చెలీ!

నీవు వ్రాసిన లేఖ చేరినది. రాష్ట్రమహిళాసభ చూచివచ్చితివిగదా. అచటి విశేషములు వ్రాసినావు శ వేమని వ్రాసితివి. బెజవాడలో రాష్ట్రమహిళాసభ ముగియునప్పటికి మద్రాసులో గృహలక్ష్మి టపాకట్టు సమయము సమీపించెను. కాన జనవరినెలకు పంపవలెనను కొంటిని. ఈలోగా అఖిలభారత మహిళాసభ మద్రాసులో జరుగునను వార్త వినవాయెను. వేడి వేడి వంటకములు తయారైయుండగా చలిదిపదార్థములు భుజింప నాసపడువారుందురా? అందులో స్థానికముగా జరిగెడి అఖిలభారతమహిళాసభ వార్తలకంటె జరిగిపోయిన రాష్ట్రసభవార్తలెట్లు ప్రాముఖ్యత వహింపగలవు. కానవానికి తావిచ్చుటయు క్షమ. పిమ్మట మనటపా నడపవచ్చుననుకొంటిని. పైగా పెండ్లి ప్రయాణములును పండుగపేరంటములును మనలేఖల కించుక యవరోధము గలిగించినవి. అయిననేమి? ఆలస్యమైనదేగాని ఆవశ్యకత తీరలేదు. ఎప్పటి కప్పుడు బెజవాడరాష్ట్రమహిళాసభ విశేషములు నీకు తెలుపవలయునని ఆతురపడుచునే యున్నాను.

ఈమారు ఆంధ్రరాష్ట్రమహిళాసభ 1947 సంవత్సరము డిశంబరు 6, 7, తేదీలలో ఆంధ్రదేశమునకు కేంద్రస్థానమైన బెజవాడలో జరిగినది. దాదాపు ఆంధ్రదేశమునందలి యన్నిజల్లాలనుండియు, ఆంధ్రరాష్ట్రమునకు రాజధానికానున్న మద్రాసునుండియు ప్రతినిధులువచ్చినారు. ఈ మహిళాసభకు అధ్యక్షురాలు శ్రీమతి కొండ పార్వతీదేవి బి. ఏ. గారు. పార్వతీదేవిగారు సుప్రసిద్ధదేశసేవా పరాయణులై దేశభక్తబిరుదుగొన్న కొండ వెంకటప్పయ్య పంతులుగారి అనుంగుపుత్రి; తండ్రియందుగల దేశభక్తి, సేవాసక్తి కార్యదీక్ష, ఆమెయందును తొణికిసలాడుచున్నవి. కావున ఆమెపట్టభద్రురాలు కాగానే పైతృకంబైన సేవారంగములో ప్రవేశించి స్త్రీజనాభ్యుదయ సేవకు తనజీవితమును అంకితము చేసికొనినది. క్రమబద్ధమైన కార్యక్రమము గాని, సరియైన లెక్కపద్దులుగాని లేక చిందర వందరగనున్న రాష్ట్రమహిళాసంఘ కార్యక్రమమును చేతికితీసికొనినది. గతమూడువత్సరములలో ఆమె కార్యదర్శిత్వముక్రింద రాష్ట్రమహిళాసంఘమెంతయో ఉన్నతస్థితికి వచ్చినది. ప్రాథమిక సభ్యురాండ్రసంఖ్య అత్యధికమైనది. గ్రామతాలూకా జిల్లాసంఘము లేర్పడి పనులు జరిపినవి. రాష్ట్రమంతట పెక్కుమార్లు పర్యటించి స్త్రీలలో అవబోధము గలిగించినది. పార్వతీదేవి కార్యకౌశలమును అఖిలభారత మహిళాసంఘమువారు గుర్తించినారు. 1946 సంవత్సరములో స్విట్జర్లాండులో జరిగిన అంతర్జాతీయమహిళాసభకు వెడలు ప్రతిధునిలకు నాయకురాలినిగా చేసిపంపినారు.

విదేశపర్యటనముచే పార్వతీదేవిగారి అనుభవము, కార్యదీక్ష ద్విగుణీకృతమైనది, కాన సహజముగ దుర్బలశరీరయు, అనారోగ్యవతియు నయ్యు సంఘసేవ చేయుచున్నది.

సభా ప్రారంభకురాలు అమ్మన్నరాజాగారు. స్వాగతసంఘాధ్యక్షురాలు కలగర పిచ్చమ్మగారు. 6-12-47 తేదీ సాయంత్రము అయిదుగంటలకు మహాసభ ఆరంభమైనది. ప్రార్థనాదికములైన తరువాత శ్రీ పిచ్చమ్మగారు ప్రస్తుతస్త్రీల సమస్యలనెల్ల చర్చిస్తూ స్వాగతోపన్యాసము చదివినారు. పిమ్మట సభా

ప్రారంభకురాలు శ్రీమతి అమ్మన్నరాజాగారు ప్రస్తుతదేశపరిస్థితులను స్త్రీల కర్తవ్యమును వివరించుచు సావధానముగను విపులముగను ఉపన్యసించినారు. తరువాత అధ్యక్షురాలు పార్వతీదేవిగారు అఖిలభారత మహిళాసంఘము భారత మహిళాభ్యుదయమున కెట్లు కృషిచేయుచున్నదియు వివరించుచు, దేశము నందన్ని ప్రాంతములను మహిళాసంఘమునందు 30,000 ప్రాథమిక సభ్యురాండ్రుకలరనియు, 41 శాఖలును, 180 ఉపశాఖలును, కృషి చేయుచున్నవనియు తెలిపినారు. మన ఆంధ్రరాష్ట్రములో ఈ మహిళాసంఘము పక్షమున 6000 సభ్యురాండ్రుగలరనియు 10 జిల్లా సంఘములు 30 తాలూకా సంఘములు గలవనియు విశదీకరించినారు. అంతర్జాతీయ మహిళామండలితో మన భారతమహిళాసంఘమునకుగల సంబంధమును, అంతర్జాతీయ వ్యవహారములలో భారతనారీలోకము పాల్గొని చేయుచున్న అఖండకృషియు, ఇంకను భారతమహిళాసంఘము స్వదేశములోను విదేశములోను చేయవలసినపనియు ప్రస్తుత దేశకాలపరిస్థితులలో స్త్రీలు నిర్వహింపవలసిన బాధ్యతలును చక్కగా వివరింపబడినవి మొత్తముమీద పార్వతీదేవిగారి ఉపన్యాసము విషయగర్భితమై యున్నదని తెలిపినజాలును, దాని విలువగుర్తించుటకు ఆమె ప్రతిభ గమనించుటకు.

పూర్వము రాష్ట్రమహిళాసభకు సభకువచ్చినవారెల్లరు ప్రతినిధులుగా యెన్నుకొనబడెడివారు. ఈమారట్లుగాక ఆయాసంఘములలో సభ్యురాండ్ర లెక్కప్రకారము జిల్లాలవారిగా సభకు యెన్నుకొన బడివచ్చిరి. అయినను దాదాపు పదిజిల్లాలనుండి ప్రతినిధులును వారికి ఇనుమిక్కిలిగా ప్రేక్షకురాండ్రును విచ్చేసిరి. విశాలమైన మ్యునిసిపల్ హైస్కూలు ఆవరణములో మాగంటి అన్నపూర్ణదేవిపేరట నిర్మితమైన విశాలమగు పందిరిలో మహిళాసభ సమావేశమైనది. విద్యుద్దీపములు, లౌడుస్పీకర్లు మున్నగువసతులన్నియు చేకూర్చబడినవి. హైస్కూలుమేడమీది పెద్ద పెద్ద గదులు జిల్లాలవారిగా ప్రతినిధులకు బసలుగా ఏర్పాటు చేయబడినవి. వందలకొలది సేవికాగణముయొక్క సహాయమేగాక అసంఖ్యాకపురుషులసహాయమును చేకూర్చబడినది.

వివిధమండలములనుండి విచ్చేసిన విదుషీగణముతో సభ కలకలలాడినది. గదులు గలగలలాడినవి. ఆంధ్రనారీమణులట్లు యేడాదికొకమారు కలిసికొని పరస్పర సుఖాలాపములతో గడపు టనునది యొక సుఖమైన అనుభూతి; దివ్యమైన ఆనందము, మధురమైనదృశ్యము. నిజమునకు ఏపెండ్లికందరు విదుషీమణులు సమావేశమగుట సంభవించును? ఆహ్వానసంఘాధ్యక్షుక, ప్రారంభక, అధ్యక్షురాండ్ర ఉపన్యాసములతో ప్రథమదినసమావేశము ముగిసినది. నాటిరాత్రిభోజనానంతరము ఖూనీ అను నాటకప్రదర్శనము జరిగినది. ఈనాటకము స్వర్గీయ త్రిపురనేని రామస్వామిచౌదరిగారిచే విరచించబడినది; గుడివాడ సూతాశ్రమ వారిచే ప్రదర్శింపబడినది.

ప్రదర్శనమునకు ముందు వేదమతములోని వైరుధ్యములను వివరిస్తూ ఒకఉపన్యాసము జరిగినది. వసిష్ఠవిశ్వామిత్రులకుజరిగిన వివాదము బ్రాహ్మణ బ్రాహ్మణేతర వివాదగాని ఆత్మబలమునకు పశుబలమునకు జరిగిన పోరాటముగాదని యీ ఉపన్యాసకర్త వివరించారు. పిమ్మట నాటకమారంభమైనది. ఈనాటకము లోని కథాంశము భాగవతములోని వేనరాజునకు సంబంధించినది. అయితే వేనరాజును బ్రాహ్మణులైన మహర్షులు శాపదగ్ధుని కావించిరనే విషయము పురస్కరించుకొని యీ నాటకము విరచింపబడినది. కాని భాగవతగాథకును ఈనాటకగాథకును చాలవ్యత్యాసముగలదు. భాగవతములోని వేనరాజు బహుదుర్మార్గుడు. ప్రజాకంటకుడు. వేదమతాచారవిరోధి. ఇతనికి దేవుడులేడు; తానే దేవుడనని యితనివాదన. వేదచోదిత కర్మల నిత డామోదింపడు. ఆకతాయియైన ఈపుత్రుని సన్మార్గమునబెట్ట లేకను, ఏకైకపుత్రుని కఠినముగా శిక్షింపలేకను, ఇతనితండ్రియైన అంగరాజు భార్యాపుత్రులను, రాజ్యమును పరిత్యజించి యెటకో వెడలి పోయినాడు. దేశము అరాజకమైనది. అప్పుడు పెద్దలెల్ల రాలోచించి రాజమహిషి అనుమతిని వేనునకు

పట్టముగట్టినారు. సహజదుర్మార్గప్రవృత్తికి రాజ్యాధిపత్యము తోడుకాగనే వేనుని దౌష్ట్యము మితిమీరి పోయినది. ప్రజలను బహువిధముల హింసింపబూనినాడు. మహర్షులు ఇదితగదని వేనుని కెన్నోవిధముల బోధచేసిరి. అతడువినలేదు. కావున ప్రజాక్షేమమునిమిత్తము మహర్షులతనిని శాపదగ్ధునిచేసినారు.

ఇది భాగవతములోనికథ. కాని నాటకములో యీకథ పూర్తిగా మార్చబడినది. నాటకములోని వేనుడు బహుమంచివాడు. న్యాయశీలుడు. అహింసావ్రతుడు. యజ్ఞపశువుల ఆర్తనాదము వినలేని దయార్ద్రహృదయుడు. హింసాత్మకమైనందుననే యితడు యజ్ఞములనిషేధించినాడు. యజ్ఞములు నిషేధించినందులకు ఆగ్రహముచెందినవారై బ్రాహ్మణులైన మహర్షులు, మద్యమాంసాదులు సేవించువారైన బ్రాహ్మణులు, నీతినియమ విరహితులైన బ్రాహ్మణులు, క్రోధించి, ధర్మాత్ముడైన వేనుని ఖూనీచేసినారు.

దుర్మార్గుడైన వేనుని చంపిన తప్పేమున్నదని లోకము అభిప్రాయపడవచ్చునని కాబోలు నాటకములోని వేనుడు కడు మంచివాడుగ వర్ణింపబడినాడు. కథపొడుగునను వేదధర్మములు, బ్రాహ్మణులు చిత్తము వచ్చినట్లు నిందింపబడినారు.

ఆంధ్రరాష్ట్ర మహిళాసభ ప్రతినిధులవినోదార్థము ప్రదర్శింపబడిన నాటకము ఇది. ఈనాటకమునకును ఆంధ్రరాష్ట్ర మహిళాసభకును ఏమిసంబంధమో తెలియదు. ఇదిప్రస్తుతమునకు సంబంధించినదికాదు. స్త్రీలకు ఉపయుక్తమైనదియు కాదు. స్త్రీలసమస్యలకు చెందినదియు కాదు. ఒకనీతినిగాని ధర్మమునుగాని బోధించునదియు గాదు. పోనిమ్ము; మహిళాసభ గనుక యే బాలికలచేతనైన ప్రదర్శించినారనిన నదియు లేదు. పనిగట్టి గుడివాడ సూతాశ్రమమునుండి పిలిపించినపురుషులచే నీ నాటకమును ప్రదర్శింపజేసినారు. ఈనాటకముచూచినమీదట యిది వేనరాజుఖూనీగాదు, బ్రాహ్మణులఖూనీ యనిపించినది. చూచి ఆనందించినవారు కన్పించలేదు. బ్రాహ్మణులైనవారిమనసులు చిన్నబోయినాయి. కాని వారి మనసులు బ్రాహ్మణుల యెడ క్రోధోక్తములైనాయి. మహిళాసభలలో ఇట్టి సంఘటన సరిక్రొత్త.

మఱునాడుదయము శ్రీమతి గుడిపూడి యిందుమతీదేవిగారి అధ్యక్షతక్రింద వైజ్ఞానికసభను ప్రారంభించుచు, శ్రీమతి వేదవల్లి తాయారమ్మగారు విజ్ఞానాత్మకమైన చక్కని ఉపన్యాసముచేసినారు. పిమ్మట ఇందుమతీదేవిగారి ఉపన్యాసము జరిగినది. ఇందుమతీదేవి శిష్టాచారసంపత్తిగల విద్వత్కుటుంబమున జన్మించిన కవయిత్రి. చక్కనివాక్చమత్కృతి శ్రావ్యమైనకంఠము ఆమెకు భగవత్ప్రసాదము. ఆమెకు సనాతనాచారములపై అభిమానమెంతయో, దేశభక్తియు నంతగలదు. గాంధీమహాత్మునిపై గాఢగౌరవము. ఖద్దరుపైనెన లేనిప్రేమ. ఇందుమతీదేవిగారి ఉపన్యాసమొకరసధుని; అందులో పాటలు, పద్యములు, శ్లోకములు, పిట్టకథలు అవ్వారిగాదొరలును- హృదయరంజకమైన యేహరికథనో వినుచున్నట్లు శ్రోతలు ఆనందింతురు. ఇందుమతీదేవిగారు వివిధవిషయములపై సుమారు రెండుగంటలుపన్యాసముగావించిరి. తరువాత శ్రీమతి రుక్మిణీలక్ష్మీపతిగారు మద్రాసుశాసనసభలో జరుగుచున్న దేవదాసీబిల్లు, బహుభార్యానిషేధపుబిల్లు, వ్యవసాయభూములలో స్త్రీలకు భాగార్హతనొసగుబిల్లు నాదిగాగలవానిని గుఱించియు మెజారిటీలేనందువల్ల స్త్రీలకు గలుగుచున్న అన్యాయములనుగుఱించియు, పదవులనిచ్చు సందర్భములలో స్త్రీలయెడ చూపబడుచున్న వ్యత్యాసమునుగుఱించియు, దీర్ఘముగనుపన్యసించిరి. పిమ్మట వల్లభనేని సీతామహాలక్ష్మమ్మగారు గూడా మద్రాసుఅసెంబ్లీ విశేషములగూర్చి యుపన్యసింప నారంభించిరి. అప్పటికే పదిరెండుగంటలుదాటి భోజనమునకువెళ్లవలసి వచ్చినందున వారిఉపన్యాసమును నేనువినలేదు.

సాయంత్రము నాలుగంటలకు మహిళాసభ మరలప్రారంభమైనది. జిల్లాకార్యదర్శినుల నివేదికలైన పిమ్మట తీర్మానములారంభించినారు.

భారతావని స్వాతంత్ర్యము బడసినందుకు జోహారులర్పింపబడినవి. అఖండభారతవర్షము రెండుగా ఖండింపబడినందులకు విచారించుచు మరలఐక్యముకావలెనని సూచింపబడినది. సోదరి తుర్లపాటి రాజేశ్వరమ్మ

గారిమృతికి విచారముసూచింపబడినది. వితంతు స్త్రీలకు భాగ్యార్హతగలిగించు 1937-సం॥రపుచట్టము వ్యవసాయ భూములకుగూడా వర్తించుపట్ల గత 10సం॥లకువర్తించునట్లు మద్రాసుశాసనసభవారు చేయనందులకు ఆక్షేపణ చేయబడినది. బహుభార్యాత్వనిషేధపుబిల్లుగూడా త్వరలో శాసనముకావలయుననికోరబడినది. ప్రతియూరను స్త్రీలకు ప్రత్యేక గ్రంథాలయము పెట్టుటేగాక సంచారగ్రంథాలయముగూడా పెట్టవలెనని దొరతనమును కోరిరి. అన్నిసంస్థలలో స్త్రీలకు పురుషులతోసమాన ప్రాతినిధ్య మీయవలెననిరి. ఆంధ్రరాష్ట్రమునందు ఒకటి రాయలసీమలోను, ఒకటి ఉత్తరసర్కారులలోను, రెండు స్త్రీకళాశాలలు కావలెననిరి. దేశములో మతకల్లోలములు చెలరేగకుండ స్త్రీలుగూడ కృషిచేయవలెననియు, ఆత్మరక్షణచేసికొనుటకు ప్రభుత్వము వారు శిక్షణకేంద్రము నేర్పరచి స్త్రీలకు శిక్షణనీయవలెననియుకోరిరి. రైళ్లలో స్త్రీలకుగలుగుచున్న అసౌకర్యముల నివారించవలెననిరి. విద్యావతులైన స్త్రీలు విద్యరానివారికి విద్యనేర్పవలెననిరి. సాంఘికవిషయములను ప్రత్యేకశాఖగాతీసి దానికి ప్రత్యేకముగా నొకమంత్రిని నియమింపవలెననియు ఆమంత్రిపదవికి స్త్రీనే నియమింపవలెననియు సూచించిరి. ఆంధ్రరాష్ట్రములో వివిధనామములతో మహిళాసంఘము లేర్పడుచుండుట శోచనీయమనియు దీనివలనసంఘబలము క్షీణించుననియు, ఆంధ్రమహిళలు అట్టి సంస్థలలో చేరక అఖిలభారత మహిళాసంఘమునందేచేరి దానికి చేయూతనీయవలెననియు హెచ్చరించిరి. మహిళాసంఘము పక్షమున బాలికలకు ప్రత్యేకశాఖనేర్పరచి వారిలోవిద్య, లలితకళలు, సంఘసేవ, క్రమశిక్షణ అలవడుటకు ప్రయత్నింపవలెననియు, 'భారత కన్యామండలి' అనుపేరుతో ఈ శాఖను వ్యవహరింపవలయుననియు, ననిరి. ఆంధ్రమహిళాభ్యుదయమునకు అపారకృషిచేసిన శ్రీవీరేశలింగము పంతులుగారి శతవార్షిక జయంతిని, రాబోవు ఏప్రియలు 16-వ తేదీని ఆంధ్రమహిళాసంఘములన్నియు యుత్సాహముతో చేయవలెనని తీర్మానించిరి. కస్తూరిబా నిధిని ఆంధ్రరాష్ట్ర మహిళాసంఘమువారి సలహాపై వినియోగించవలెనని తీర్మానించిరి. ఇంకను నిరక్షరాస్యత నిర్మూలింపవలెననియు లలితకళలను పునరుజ్జీవింపవలెననియు దాదులు మంత్రసానులు ఎక్కువమంది తయారై గ్రామములలో సేవచేయవలెననియు, గ్రామోద్యోగములకు పురుష వారసులు లేనపుడు వారికోమార్తెలను వారసులనుగా చేయవలెననియు, తీర్మానములుగావించిరి. ఈమహిళా సభ రెండుదినములు స్త్రీలుచేయుచున్న ఉపన్యాసములు చర్చలు, పురుషులుగూడ పందిరిచుట్టూ నిలువబడి అత్యంతశ్రద్ధతోవినుట ఆశ్చర్యము గలిగించినది. మనస్త్రీలుగూడ యీమహిళాసభయే మన అక్కరలన్నియు తీర్చగల కల్పవృక్షము అనుకొనినట్టుగా తమకష్టసుఖములన్నియు వివరించిరి. సభరెండుదినములు జరిగిన తీరునుబట్టియు, చేయబడిన తీర్మానములనుబట్టియు, అధ్యక్షురాలు సభనడుపుటలో జూపిన ఓర్పునేర్పులను బట్టియు సభజయప్రదముగా జరిగినదని చెప్పవచ్చును. దీనికితోడు ఆహ్వానసంఘమువారు ప్రతినిధులకు భోజన భాజనాదుల నమర్చుటలోగూడ సరసముగా ప్రవర్తించినట్లైతే వారిసత్కారం స్తవనీయమై ఉండెడిది. కాని ఈవిషయములో ఆహ్వానసంఘమువారు అవలంబించినవైఖరి ప్రతినిధులకెంతయో మనస్తాపము కలిగించినది.

సాధారణముగా యిటువంటి సభలు జరుగుసందర్భములో శుచిగను, రుచిగను చేయగలరను ఉద్దేశ్యముతోను ఎల్లరు తృప్తికరమైన భోజనము చేయవలయునను సుద్దేశ్యముతోను బ్రాహ్మణులనే వంటవారినిగా నియమించుట ఆచారముగానున్నది. ప్రతివత్సరము జరుగుచున్న రాష్ట్రమహిళా సభలలోనేమి, కాకినాడలో జరిగిన అఖిలభారత మహిళాసభలోనేమి, ఇదియే పద్ధతి అవలంబింపబడినది. ఆహ్వానసంఘమన అతిథిసత్కార సంఘముగదా! ఆతిథ్యములో భోజనమునుమించిన సత్కారమేమున్నది? అతిథులకుసమ్మతమైనరీతిని రుచ్యమైన భోజనముపెట్టినప్పుడే ఆ ఆతిథ్యధర్మము సక్రమముగా నిర్వర్తించినట్లగును. పంక్తిభోజనముల విషయములోకొంత సామరస్యమిటీవల యేర్పడినప్పటికిని కేవలము బ్రాహ్మణేతరులే వంటచేయగా భుజించడమనేది బ్రాహ్మణులకింకను అలవాటుకాలేదు. స్త్రీలలోబొత్తిగనే లేదు. అచ్చటిపదార్థముల రుచిపాకములనుబట్టియు, భోజనప్రదేశమును శుభ్రపఱచుచున్న విధానమును

బట్టియు, వంటచేయువారి వైఖరినిబట్టియు, అచట వంటచేయువారు బ్రాహ్మణులుగారని ప్రతినిధులకు తెలిసి గుసగుసలారంభించిరి. విచారించగా వంటచేయువారు నేతాజీ కమ్మ హోటలువారని తెలిసిపోయినది. ఈసంగతి తెలిసినతరువాత స్త్రీలలో బయలుదేరిన అలజడి యింతయంతగాదు. చాలమంది అక్కడభుజించుటకు మనస్కరింపక ఊరిలో బంధుమిత్రుల గృహములెక్కడున్నవని వెతుకుకొనుచుపోయిరి. కొందరు, హోటలులో భుజించిరి. మరికొందరు అరటిపళ్లు కొనుక్కొనితినిరి. ఇంకకొందరు పస్తులేపడుకొనిరి. అన్నిత్రోసివేసుకొని అచటనే భోజనముచేయబూనినవారుగూడ ఇదేమిభోజనము బాబూ అని మొత్తుకొనిరి. ఆవంటవారు సిగరెట్లు వ్రేళ్లసందున యిరికించుకొని పొగవిడుచుచూ భోజనపదార్థములు ఫలహారపుప్లేటులు అందింపవచ్చినపుడు బ్రాహ్మణ వైశ్యులకు కాకపోయినను తదన్యులకు మాత్రమెట్లురుచించును? అధ్యక్షురాలు పార్వతీదేవిగారు ఎంగిళ్లుపూర్తిగా శుభ్రపరచని ఆప్రదేశములో భుజింపజాలక కిటికీలో అన్నముపెట్టించుకొనితినిరనిన ఇతరుల విషయలో నెట్టి ఆదరము జరిగినదో వ్రాయుటెందులకు?

గతరెండు దినములనుండియు భోజనముల విషయములో ప్రతినిధినులు పడుచున్న కష్టములు, చేయుచున్న పస్తులు చూచిన మీదట పార్వతీదేవిగారికెంతయో మనఃక్లేశముగలిగి రెండవనాటిరాత్రి "ఇదేమిటండీ! యిటువంటి భోజనము లేర్పాటు చేసినారు; బ్రాహ్మణులచేత వంటచేయించెదమని చెప్పియుంటిరే? ఇట్లుచేయించితిరేమి? ప్రతివారు ఇదేమి భోజనమని మొత్తుకోవడమే నే!" అని రత్నమాంబగారి నడిగిరి. అందులకు, "వంటబాగాలేదంటే ఔదేమోనని ఒప్పుకుంటాను గాని బ్రాహ్మణులచేత చేయించలేదంటున్నారే? ఆమాటేనాకు అర్థంకావడంలేదు. ప్రస్తుతకాలపరిస్థితులెరిగి ఇట్లా మీరెట్లా అడుగుచున్నారో నాకు అర్థంకావడంలే" దని రత్నమాంబగారు బదులుచెప్పినారు. "ఏమండీ పిచ్చమ్మగారు! మేము బ్రాహ్మణులచేత వంటచేయించెదమని నాతోచెప్పలేదా?" అని మరల పార్వతీదేవిగారు పిచ్చమ్మగారి నడిగినారు. పిచ్చమ్మగారేమియు చెప్పలేకపోయినారు. ఇంతలో మరొకామె "బ్రాహ్మణులచేత వంట చేయించలేదని ఎట్లాఅడుగుతున్నారమ్మా! ఎంతధైర్యంగా అడుగుతున్నారమ్మా! బాగా బ్రాహ్మణులచేత వంటచేయిస్తే తిందామని వచ్చారు కాబోలు, ఆ ఆటలికసాగ" వన్నది. "ప్రతినిధులవద్ద మూడేసి రూపాయిలు వసూలుచేశారు; మీరు ఊరికే భోజనము పెట్టలేదమ్మా!" అని మరొకామె జబాబుచెప్పినది. "ఈబ్రాహ్మణులు చచ్చిపోతే బాగా ఉంటుం"దని బి. ఏ. చదివిన వాలంటీరొకామె వాక్రుచ్చినది. "గాంధీగారేమంటున్నారు, అందఱు, ఒకటికావలె ననుటలేదా," అని మఱొకరన్నారు. ఈవాదించువారికి నిజముతెలిసినట్లులేదు. గాంధీగారట్లు చెప్పవచ్చునుగాని నిర్బంధముగాగాని, చెప్పకుండాగాని ఏసంస్కరణనుగాని ఆచరణలోపెట్టుటకు మహాత్ముడామోదించ డనునది సత్యము. ఇట్టిసందర్భములలో మహాత్ముని పేరుచెప్పుట ఆయనను అగౌరవించుటే కాగలదు. ఏసంస్కారమైనను ఐచ్ఛికముగా జరిగినప్పుడే దానికి విలువయు ప్రయోజనమును నుండును. నిర్బంధముగా తినిపించినను చెప్పకుండ తినిపించినను అది సంస్కారమనిపించుకొనజాలదు. అట్లుచేయుట ఆహ్వానసంఘము వారికి యుచితమును కాదు. నాటకప్రదర్శనముతో ఆరంభమైన సత్కారము భోజనములతో నిట్లు ముగిసినది. ఇంతకును బ్రాహ్మణేతరులకు బ్రాహ్మణులపైనున్న ఆగ్రహము జన్మవల్లవచ్చినదిగాని కర్మవల్లవచ్చినదిగాదు. వీరువారితో భోజనభాజనాదులు జరిపినందువల్ల వారు సంతసింతురనుట కల్ల. వారితో భుజింపనివారు నిందింపబడుచుండగా భుజించెడివారు అవహేళన చేయబడుచున్నారు. ఇంతకును మహిళాసభ జాతిమతకులాలకు సంబంధించినదిగాదు. మహిళాసభ సభ్యురాండ్రైనవారు భోజనభాజనాదులలో ఈరీతిగా నడువవలెనను నిబంధనలేదు. మహిళాసభలో వర్ణాశ్రమ ధర్మములలో విశ్వాసముగలవారుగూడ కలరు. వారిని మీశ్రోత్రియత్వమును విడనాడవలెనని అడుగుటకు ఎవరికి హక్కులేదు. వారివారి యిష్టముల ననుసరించి భోజనాదులమర్చుట ఆతిథ్యమిచ్చువారిధర్మము మాత్రమగును.

ఈ అలజడి అంతయు ముగిసిన తరువాత కార్యనిర్వాహక వర్గపుయెన్నికలు జరిగినవి. రాష్ట్రకార్యదర్శిపదవికి వావిలికొలను పద్మాసనమ్మగారి నొకరు సూచించగా ఈడ్పుగంటి రత్నమాంబగారిని వేరొకరు

ప్రతిపాదించినారు. గత రెండు దినములనుండి కులతత్వదేవతాదివ్యరూప సాక్షాత్కారము సహస్రముఖముల అయిన తరువాత పద్మాసనమ్మగారి గెలుపు అసంభవమనీ బ్రాహ్మణుల విషయములో మేము నూతైవంగు రనుమాట రూఢిచేయుదురని తెలిసినప్పటికి ప్రతినిధుల విచక్షణకొఱకు యీ ప్రతిపాదన చేయబడినది; అనుకొనినట్టుగా రత్నమాంబగారుగెలిచి అభినందన లందుకొనినారు. బ్రాహ్మణులపట్ల అన్నికులములవారు ఒకటైనప్పటికి ఈ ఘమేకమంతవఱకేగాని పిమ్మట అనేకమే; లేకున్న ఇన్నికులసభలు జరుగుటకు కారణ మేమి? నేడు ప్రతివర్ణమువారు తమకులసభల తాము జరుపుకొనుచు తమ కులకవులను సత్కరించుకొనుట తమ పండితుల నాదరించుట తమ కులవిద్యార్థులకు వేతనము లిచ్చుకొనుట తమ కులమునకు ప్రత్యేక ప్రాతినిధ్యము లిమ్మనికోరుట జరుపుచున్నారు. అగ్రజాతులవారుమాత్ర మిట్టి అభిమాన మేమాత్రము చూపరాదని వాదించు చున్నారు.ఇదియెట్టి ఔచిత్యమో! వారికే తెలియవలయును. మనలో మనమింతకులభేదమును, వర్ణద్వేషమును పెంపొందించుకొనుచు, ఎగువకులములకు ఎగబాకవలయునను నాసయేగాని దిగువకులముల దిక్కుచూడవలయునను తలంపులేక వర్తించుచు, మీకులాభిమానమును మీరువీడ లేలనని ఒకరిని యడుగుటలో ఏమిసబబు గలదో నాకు తోచుటలేదు. భారతదేశానికి వేరుపురుగైనాడని జిన్నానేల నిందించవలయునో అర్థమగుటలేదు. భారతదేశమునకు మతద్వేషము వేరుపురుగై బాధించుచుండిన కులద్వేషము చీడపురుగై పీడించుచున్నది. భాషాద్వేషము గొంగళిపురుగై కొఱికిపెట్టుచున్నది. జీసస్ క్రైస్తు చెప్పినట్లు తమకంటిలో దూలము తొలగించు కొనక ఎదిరికంటిలో నలుసుల వెదకు తత్త్వము మనలో నుండినన్నాళ్లు భరతవర్షమెట్లు బాగుపడును? గురువిందగింజ ఎదుటినలుపునే కాని తనక్రింది మసినెఱుగదన్న సామెతయెరిగినదేగదా. ఎవరుగాని బాహ్యమును చూచినట్లు అంతరమును చూడనేర్చినప్పుడుగాని తమలోపములను తాము గుర్తెరుగజాలరుగదా.

మహిళాసభలు అయిన తరువాత ఊరిలో బంధుమిత్రుల దర్శింప బయలుదేరితిని. ప్రతివారును ఎందులకు వచ్చితివని ప్రశ్నించుటయే. మీ ఊరిలో మహిళాసభ జరుగ మీకు తెలియదా అనిన తెలియదనిరి. అప్పుడు స్వర్గీయ తుర్లపాటి రాజేశ్వరమ్మగారు పురస్త్రీలను కూడగట్టుకొని సమర్థతతో మహిళాసభలు జరిపిన దినములు జ్ఞప్తికి వచ్చెను. సోదరి రత్నమాంబగారికి ఆంధ్రరాష్ట్రకార్యదర్శి పదవితోబాటు అఖిలభారతస్థాయి సంఘసభ్యత్వమును చేకూరినది. కాన ఆంధ్రసోదరీమణుల సహకారముతో స్నేహముతో ఐకమత్యముతో రాష్ట్రీయకార్యముల నెరవేర్చి ఆంధ్రమహిళల కీర్తి ప్రతిష్ఠలనితోధికము చేయవలయునని నా ఆస. కల్పలతా! రత్నమాంబగారు అంతటి సామర్థ్యము గలవారే గనుక మన ఆశ సఫలమగునని నమ్మవచ్చును. సెలవు.

ఇట్లు.

మిత్రురాలు

శారద.

(విలేఖరుల అభిప్రాయములకు పత్రికాసంపాదకులు బాధ్యులుగారు. గృ॥ సం॥)

—★—